# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-03-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **రేపు ఉగాది పండుగను పురస్కరించుకుని గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి శుభాకాంక్షలు తెలిపారు.**

**2.** **సంక్షేమ పథకాలు, విప్లవాత్మక సంస్కరణలకు నాంధి పలికింది తెలుగుదేశం పార్టీ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.**

**3.** **గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి పనులను 5 వందల 57 కోట్ల రూపాయలతో చేపట్టనున్నట్లు ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు.**

4\. **మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు స్థానికంగా సమకూరే నిధులను వినియోగిస్తామని పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ వెల్లడించారు.**

**5.** **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

==========================

రేపు ఉగాది పండుగను పురస్కరించుకుని గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ విశ్వావసు నామ నూతన సంవత్సరం అందరికీ కొత్త ఉత్సాహాన్ని, ఉజ్వల భవిష్యత్తును తీసుకువస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. జీవిత అభిరుచులు కలగలిపిన ఉగాది పచ్చడి, ఏడాది పొడవునా అన్ని రకాల రుచులను అనుభవించడానికి అందరికీ నూతన అనుభూతి కలిగిస్తుందని తెలిపారు. ఈ ఉగాది పండుగ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు శాంతి, ఐశ్వర్యం, సామరస్యం, ఆనందాన్ని కలిగిస్తుందని విశ్వసిస్తున్నట్లు తెలిపారు.

--------------------------

సంక్షేమ పథకాలు, విప్లవాత్మక సంస్కరణలకు నాంధి పలికింది తెలుగుదేశం పార్టీ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఈరోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.టి.ఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ... వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లను తొలి సారిగా ప్రారంభించింది టీడీపీ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్య, ఉద్యోగాల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనతా టీడీపీ సొంతమన్నారు.

బిసి, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు రాజకీయ అధికారం ఇచ్చిన పార్టీ తెలుగుదేశంపార్టీ అని పేర్కొంటూ..

..వాయిస్ 38 సెకన్లు

-----------------------------

గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి పనులను 5 వందల 57 కోట్ల రూపాయలతో చేపట్టనున్నట్లు ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టే ఈ పనులను అత్యంత నాణ్యతతో త్వరగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. మండలాల కేంద్రాలను గ్రామాలతో అనుసంధానం చేయడం కోసం రాష్ట్రం వ్యాప్తంగా 402 రహదారులను ఒక వెయ్యి 2 వందల 2 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించనున్నట్లు చెప్పారు.

-----------------------------

మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు స్థానికంగా సమకూరే నిధులను వినియోగిస్తామని పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలో ఈరోజు జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మున్సిపాలిటీలకు ప్రజలు చెల్లించే పన్నులను ఆయా మున్సిపాలిటీల పరిధిలోని అభివృద్ధి పనులకు వినియోగించుకునేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారన్నారు. ఈ నిర్ణయం వల్ల ఆయా మున్సిపాలిటీలకు నిధుల కొరత తగ్గుతుందన్నారు. గ్రీన్ కార్పొరేషన్ ద్వారా పట్టణాలలో పచ్చదనాన్ని పెంపొందించి మరింత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు.

-----------------------------

రాష్ట్రంలో పేదరికం లేని సమాజాన్ని నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా చిన్నమండెం మండలం, బోరెడ్డి గారి పల్లెలోని తన నివాసంలో ఈరోజు ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు లాంటివన్నారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించారు.

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక రేపు ప్రసారం అవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

-----------------------------

అనకాపల్లిలోని శ్రీ నూకాంబిక అమ్మ వారి వార్షిక జాతర మహోత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవాలను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. ఈ సందర్భంగా గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి ఈ రోజు పట్టు వస్త్రాలు సమర్పించారు. పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయకుమార్ తదితరులు మంత్రితో పాటు అమ్మవారిని దర్శించుకున్నారు.

-----------------------------

కూటమి ప్రభుత్వంతోనే ముస్లింలకు అభివృద్ధి జరుగుతుందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ. భరత్ అన్నారు. కర్నూలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో నిన్న ఆయన పాల్గొని.. మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో మైనారిటీలకు ఎక్కువ నిధులు బడ్జెట్ లో కేటాయించామన్నారు. ఉర్దూ యూనివర్సిటీని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని పేర్కొంటూ..

..వాయిస్... 35 సెకన్లు

----------------------------

రాష్ట్రంలో 51 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించనున్నట్లు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి సిసోడియా తెలిపారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ కార్యాలయంలో నిన్న నిర్వహించిన కరువు ప్రభావ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు రెండు రోజుల్లో విడుదల చేయనున్నట్లు చెప్పారు. జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖలు సమర్పించిన నివేదికలను కమిటీ నిశితంగా పరిశీలించిందని తెలిపారు.

----------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్... 28 సెకన్లు....

----------------------------

అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో కలిసి పని చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశంలో నిన్న పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... ఇలాంటి సమావేశాలు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలన్నారు. 35 శాఖల ద్వారా 92 కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావచ్చుని, తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో శిశుసంరక్షణ కమిటీల నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బాలల సంక్షేమశాఖ డైరెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఈ జిల్లాల్లో ఏర్పాటు చేయబోయే శిశుసంరక్షణ కమిటీల్లో ఛైర్‌పర్సన్లు, సభ్యులుగా సేవలు అందించేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను నిర్దేశిత నమూనాలో, వారి అర్హత ధ్రువీకరణ పత్రాల నకళ్ళతోపాటు ఏప్రిల్ 9, 2025లోపు విజయవాడలోని బాలల సంక్షేమశాఖ డైరెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు. విద్యార్హతలు, అనుభవం, ఎంపిక విధానం, ఇతర వివరాలకు wdcw.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

====================